నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.
32/11కేవీ గోల్కొండ, గుడిమల్కాపూర్ సబ్ స్టేషన్ల పరిధిలోని జమాలికుంట, అరుణ కాలనీ, నదీం కాలనీ, ఖులీఖుతుబ్‌షా నగర్, గ్రామర్ కాలనీ, సనా హోటల్, సంతోష్ నగర్, ఎస్‌బీఐ కాలనీ, అంబా గార్డెన్, గుడిమల్కాపూర్, క్రాంతి నగర్, జీవన్ కళ్యాణ్ నగర్, హిల్ కాలనీ, హుడా కాలనీ, సాయి గార్డెన్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు.
32/11కెవి ఆసిఫ్‌నగర్, గోల్కొండ సబ్‌స్టేషన్ల పరిధిలోని గుల్షన్ కాలనీ, వినాయకనగర్ , పీస్ సిటి కాలనీ, లక్ష్మణ్ నగర్, వినోభా నగర్, జైహింద్ కాలనీ, సూర్యనగర్, బాల్‌రెడ్డి నగర్, విరాసత్ కాలనీ, ఓవైసీ కాలనీ, అక్బర్‌పుర, ఎండీ లైన్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని అధికారులు కోరారు.

విద్యార్థుల కోసం ఆధార్ కార్డు కేంద్రం ఏర్పాటు

గోల్కొండ: పాఠశాలల్లో చదివే విద్యార్థుల సౌకర్యం కోసం గోల్కొండ ధనలక్ష్మిపురలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని గోల్కొండ మండల డిప్యూటీ ఐవోఎస్ మహ్మద్ బషీరుద్దీన్ తెలిపారు. కేవలం విద్యార్థుల కోసమే ప్రత్యేకంగా ఈ ఆధార్ కార్డు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఆధార్ కార్డులో మార్పులు, కొత్త ఆధార్ కార్డు కోసం ఆయా పాఠశాలల నిర్వాహకులు విద్యార్థులను ఇక్కడికి పంపవచ్చునని తెలిపారు.

కళాకారులకు ఆహ్వానం

గన్‌ఫౌండ్రీ: కార్తీకమాసం సందర్భంగా ప్రజాపతి కల్చరల్ ఈవెంట్ ఆధ్వర్యంలో కళారాధన్ పేరిట నృత్య గాత్ర వాయిద్య సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంస్థ ఛైర్మన్ ఫణీంద్రకుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవస్థానం (బీరంగూడ గుట్ట), నవంబర్ 2న శివగంగ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం (మహేశ్వరం), నవంబర్ 5న రామలింగేశ్వర స్వామి దేవాలయం (మేడ్చల్), నవంబర్ 16న కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సి, పేరిణి నాట్యాంశాలను ప్రదర్శిస్తున్నామని ఆసక్తిగల కళాకారులు 79014 00222 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సమష్టి కృషితో పల్స్‌పోలియో విజయవంతం

యాకుత్‌పురా: మూడు రోజుల పాటు నిర్వహించిన పల్స్ పోలియో వాక్సినేషన్ కార్యక్రమాన్ని 98 శాతం విజయవంతంగా పూర్తి చేశామని వైద్య, ఆరోగ్య శాఖ డబీర్‌పురా న్యూట్రిషన్ హెల్త్ క్లస్టర్ ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ ఎన్. మురళీధర్ అన్నారు. బుధవారం యాకుత్‌పురాలో ఆయన మాట్లాడుతూ... పోలియో నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన పల్స్ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 12, 13,14 తేదీల్లో మూడు రోజుల పాటు చేపట్టామన్నారు. చివరి రోజు తమ క్లస్టర్ పరిధిలోని దారుషిఫా, అజంపురా యాకుత్‌పురా–1,2, డబీర్‌పురా, యూపీహెచ్‌సీ కేంద్రాలోని అన్ని ప్రాంతాల్లో సిబ్బంది ఇంటింటికి తిరిగి ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారన్నారు. క్లస్టర్ పరిధిలోని 38 వేల మంది చిన్నారుల టార్గెట్‌కు గాను 37,296 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన ప్రజలకు, వైద్యాధికారులు, సిబ్బంది, అంగన్‌వాడి, ఆశవర్కర్లు, నర్సింగ్ కాలేజ్ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

సేవా గుణం కలిగి ఉండాలి



విద్యార్థులకు నగదు అందజేస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

గన్‌ఫౌండ్రీ: ప్రతి ఒక్కరూ సాటివారికి సేవ చేసినప్పుడే జీవితం సార్థకమవుతుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవి.రమణాచారి అన్నారు. బుధవారం భారత వికాస పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యా వికాస్ (నిస్సహాయిత వితంతువుల పిల్లలకు ఆర్థిక చేయూత) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 2024 – 25 సంవత్సరాలకు గాను 300 మంది విద్యార్థులకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అధికారి విజయలక్ష్మీ, ఏసీపీ వై.హరీష్, ట్రస్ట్ ఛైర్మన్ అశ్విని సుబ్బారావు, సీహెచ్ హన్మంతరావు, సాధన నర్సింహాచార్య తదితరులు పాల్గొన్నారు.

దీపావళికి తుమిడీలు సిద్ధం

- అత్తారింట్లోని కుమార్తెలకు బహుమతిగా తుమిడీల అందజేత
- ఉత్తర భారతీయుల ప్రత్యేకత...
- తుమిడీలలో 150 రకాలు...
- రూ.500 నుంచి రూ.25 వేల వరకు ధరలు

చార్మినార్: దీపావళి పండుగను పురస్కరించుకుని మార్కెట్లోకి తుమిడీలు వచ్చేశాయి. వాస్తవానికి నెల రోజుల ముందు నుంచే మార్కెట్‌లో తుమిడీల విక్రయాలు జరుగుతాయి. హైదరాబాద్ నగరంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న అగర్వాల్, మార్వాడీల కుటుంబాలు దీపావళి పండుగను 'తుమిడి'లతో జరుపుకోవడం ఆనవాయితీ. దీపావళి పండుగకు కొత్త దుస్తులు ధరించడం...పూజలు చేయడం... పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చడం.. బంధు మిత్రులకు మిఠాయిలు, కానుకలు అందజేయడం తెలుగు వారి ప్రత్యేకత. అలాగే అగర్వాల్ కుటుంబీకులు తమ ఆచార వ్యవహారాలకు... సంస్కృతికి అద్దం పట్టే తుమిడిలను దీపావళి పండుగ సందర్భంగా అత్తగారింట్లోని తమ కూమార్తెలకు ప్రత్యేక కానుకగా అందజేస్తారు. పూలు, పండ్లు, స్వీట్స్‌లతో పాటు తుమిడీలను అత్తవారింటికి తీసుకెళ్లి తమ కుమార్తెలకు అందజేయడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో దీపావళి పండుగకు ముందుగానే తుమిడీలు మార్కెట్లోకి వస్తాయి. ప్రస్తుతం పాతబస్తీలో తుమిడీల విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు పాతబస్తీకి వచ్చి తుమిడీలను ఖరీదు చేస్తున్నారు.

150 రకాలు...రూ. 25 వేల వరకు ఖరీదు..

తుమిడీలలో 150 రకాలున్నాయి. ఒక్కో తుమిడి అడుగు నుంచి 15 అడుగుల పొడవు ఉంటాయి. వీటి ఖరీదు రూ. 500 నుంచి రూ.25 వేల వరకు ఉంటుంది. తుమిడీల తయారీలో ఖరీదైన ముత్యాలను వినియోగిస్తే..దాని ఖరీదు రూ.25 వేలు ఉంటుందని తయారీ దారులు తెలిపారు. తుమిడీలను రంగు రంగుల ఫర్నీలతో పాటు బట్టలతో తయారు చేస్తారు. ప్రత్యేకంగా తయారు చేసే తుమిడీల కోసం ముందుగానే ఆర్డర్ ఇవ్వాల్సి ఉంటుంది. గుజరాత్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలతో పాటు హైదరాబాద్ నగరంలోని అగర్వాల్ కుటుంబీకులు వీటిని తప్పనిసరిగా సంప్రదాయ బద్ధంగా వినియోగిస్తారు.

ఘాన్సీబజార్‌లో రద్దీ..

తుమిడీల విక్రయాలతో పాతబస్తీ ఘాన్సీబజార్ రద్దీగా మారింది. అగర్వాల్ కుటుంబీకులు ఎక్కువగా నివసించే ఘాన్సీబజార్ పరిసర ప్రాంతాల్లో ఈ తుమిడిల తయారీ ఎక్కువగా జరుగుతుంది. ఇంట్లో ఏర్పాటు చేసే ఈ తుమిడిలలో దీపాలు వెలిగిస్తారు.



ఆకట్టుకుంటున్న రంగు రంగుల తుమిడీలు



ఘాన్సీబజార్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న తుమిడీలు



రూ.25 వేల విలువైన తుమిడి



తుమిడీలతో లక్ష్మీ దేవికి ఆహ్వానం...



తుమిడీల ఏర్పాటుతో ఇంటికి లక్ష్మీ దేవిని ఆహ్వానించినట్లుగా భావిస్తాం. దీపావళి పండుగకు పది రోజుల ముందుగానే తుమిడీలను కానుకలుగా అందజేస్తారు. తమకు వియ్యంకుల కుటుంబీకుల పట్ల ఉన్న ప్రేమానురాగాలకు నిదర్శనంగా ఈ తుమిడీలను అందజేయడం జరుగుతుంది. దీపావళి పండుగకు నెల రోజులకు ముందు నుంచే తుమిడీలను తయారు చేసి వినియోగదారులకు అందుబాటులో ఉంచుతాం. తుమిడీలను వివిధ రూపాల్లో రంగు రంగుల ఫర్నీలు,విద్యుత్ బల్బులు, క్లాత్‌లతో ఆకర్షణీయంగా తయారు చేస్తాం.

– రాజేందర్ కుమార్ అగర్వాల్, తుమిడీల తయారీదారుడు

సంస్కృతికి అద్దం పడతాయి..



దీపావళి వేడుకలను తుమిడీలతో నిర్వహిస్తాం. ఇది మా సంప్రదాయం. పెళ్లై అత్తారింట్లో ఉన్న తమ కూతుర్లకు దీపావళి పండుగ సందర్భంగా ఈ తుమిడిలను బహుమతిగా అందజేస్తాం. ఎన్నో ఏళ్లుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. వారి వారి స్థోమతను బట్టి తుమిడీలను ఖరీదు చేస్తాం. నగరంలోని అగర్వాల్ కుటుంబీకులు వీటిని తప్పనిసరిగా సంప్రదాయ బద్ధంగా వినియోగిస్తారు.

– ఘన్ శ్యాం దాస్, అత్తాపూర్

దీపావళి వేడుకలకు బందోబస్తు ఏర్పాటు చేయాలి



డీసీపీ స్నేహా మెహ్రాకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ప్రతినిధులు

చార్మినార్: దీపావళి వేడుకలను పురస్కరించుకుని చార్మినార్ భాగ్యలక్ష్మీ దేవాలయంతో పాటు పరిసరాల్లో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా బందోబస్తు ఏర్పాటు చేయాలని దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రాను కోరినట్లు చార్మినార్ భాగ్యలక్ష్మీ దేవాలయ ట్రస్టీ సూర్య ప్రకాష్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సెంట్రల్ కమిటి సభ్యులు ప్యారసాని వెంకటేష్ అన్నారు. ఈ మేరకు పురానీహవేలీలోని కార్యాలయంలో డీసీపీని కలిసి ఆరు రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక పూజల్లో పాల్గొనాలని కోరుతూ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఈ నెల 18 నుంచి 23 వరకు దీపావళి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామన్నారు.. వేడుకల సందర్భంగా చార్మినార్ పరిసరాల్లోని ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లలో ట్రాఫిక్ సమస్యలతో పాటు శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. భాగ్యలక్ష్మీ అమ్మవారి ఖజానా పంపిణీ జరుగనున్నందున నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో చార్మినార్‌కు రానున్నందున క్యూ లైన్ల కోసం భారికేడ్లు ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు.

అంధుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సంఘం నాయకులు చొక్కారావు

సుల్తాన్‌బజార్: పదవీ విరమణ చేసిన అంధుల ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని తెలంగాణ అంధుల అభివృద్ధి సంక్షేమ సంఘం నేతలు అన్నారు. ఈ మేరకు బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి పి.చొక్కారావు, అధ్యక్షుడు జి.అంజయ్య గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం అంధుల కోసం హాస్టళ్లను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తున్నట్లు సమాచారం అందుతుందని, దానిని వెంటనే విరమించుకోవాలని కోరారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కరీంనగర్ స్వాతంత్ర సమర యోధుల సంఘం నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలకు రూ.50 లక్షలు మంజూరు చేసిందని అదే తరహాలో అంధుల అభ్యున్నతి కోసం పనిచేస్తున్న అంధుల పాఠశాలలు, సంస్థలు, వికలాంగుల కోసం పనిచేస్తున్న ఎన్జీఓలకు గ్రాంట్లు ఇవ్వాలని కోరారు. అంధుల సమాజ సాధికారత కోసం పనిచేస్తున్న సంఘాలతో ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. అంధులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత పాసులు ఇవ్వాలని వికలాంగులకు సంక్షేమం కోసం కేటాయించిన 5 శాతంలో 1 శాతం అంధులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి ఎస్.పరమేష్, సభ్యులు అజిత్‌కుమార్, అంజయ్య, నాగరాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే బస్తీబాట



గోల్కొండలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి బస్తీ బాట కార్యక్రమం చేపట్టామని మజ్లిస్ పార్టీ కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి నానల్ నగర్, గోల్కొండ డివిజన్లలో పలు బస్తీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అక్కడ నెలకొన్న సమస్యలను స్వయంగా పరిశీలించారు. స్థానిక ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. గత నెలలో కురిసిన భారీ వర్షాల కారణంగా రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని పలువురు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. రోడ్లు దెబ్బతినడం వల్ల డ్రైనేజీలు కూడా పూర్తిగా ధ్వంసమైయ్యాయన్నారు. నేటికి తమ బస్తీలలో మురికి నీరు ప్రవహిస్తుందని ఆయన దృష్టికి తెచ్చారు. సమస్యలు స్వయంగా తెలుసుకునేందుకే బస్తీ బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానన్నారు. త్వరలోనే తాను అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట బల్దియా వార్డు కార్యాలయం అధికారులతో పాటు స్థానిక బస్తీల నాయకులు ఉన్నారు.

అబ్దుల్‌కలాం సేవలు ఎనలేనివి



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

గన్‌ఫౌండ్రీ: భారతదేశ అంతరిక్ష ప్రయోగాలకు, దేశ రక్షణకు భారతరత్న, డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం చేసిన సేవలు ఎనలేనివని రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నేత ఎస్.మధుసూదనాచారి అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎస్.ఆర్.ఆర్. చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ విభాగాలలో సేవలందిస్తున్న ప్రముఖులకు అబ్దుల్‌కలాం స్ఫూర్తి అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్‌కుమార్, పర్యాటక శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, కుసుమ ధర్మన్న సాహిత్య కళాపీఠం వ్యవస్థాపకులు డాక్టర్ రాధకుసుమ, పినాకిని సంస్థ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు, డాక్టర్ ఎస్.రాంచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలకు సీపీకి ఆహ్వానం



సీపీ సజ్జనార్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

అబిడ్స్: హైదరాబాద్ పోలో రైడింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి నిర్వహిస్తున్న క్రీడాపోటీలకు హాజరు కావాలని నగర పోలీస్ కమిషనర్ వీసీ.సజ్జనార్‌ను సంస్థ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్‌లోని సీపీ కార్యాలయంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అదే విధంగా నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించినందుకు గాను అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌పీఆర్‌సీ వ్యవస్థాపక అధ్యక్షుడు చైతన్య కుమార్, ఉపాధ్యక్షుడు విజేందర్ సింగ్, ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపే



నవీన్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

గోల్కొండ: బీసీలు, మైనార్టీలు, దళితులతో పాటు అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారని ఆ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభ్యర్థి నవీన్‌యాదవ్ అన్నారు. బుధవారం షేక్‌పేట్‌లో ఆయన సమక్షంలో వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో పదేళ్ల పాటు జూబ్లీహిల్స్ నియోజకవర్గం పూర్తిగా వెనుకబడిపోయిందన్నారు. నియోజకవర్గంలో బస్తీలతో పాటు కాలనీలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మరోవైపు కొత్తగా వెలుస్తున్న కాలనీల్లో సైతం సౌకర్యాలు లేవన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని నెంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టుదలతో ఉన్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. ప్రజల కోసం పని చేసేది కాంగ్రెస్ పార్టీ ఒక్కటే అని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు ప్రజల కోసం కాక సొంత ఎజెండాల కోసమే పని చేస్తున్నాయన్నారు. ప్రజా సేవ చేయడానికే వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. అందరూ కలిసికట్టుగా కృషి చేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బాలకిషన్, సాయినాథ్, జి.విజయలక్ష్మి, సిద్ధజ్యోతి, బాలకృష్ణ, రఘునందన్, సతీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రిలో అన్నదానం



అన్నదానం చేస్తున్న టీఎన్జీఓ ఉద్యోగులు

నాంపల్లి: రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి ప్రాంగణంలో రోగులకు వారి సహాయకులకు తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.హుస్సేనీ బుధవారం అన్నదానం చేశారు. ప్రతి నెలా రోగుల సహాయార్థం ఇలాంటి సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు హుస్సేనీ తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా కార్యదర్శి కురాడి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, ఎంఎన్‌జె ఆసుపత్రి యూనిట్ అధ్యక్షుడు బి.శివకుమార్, కార్యదర్శి చంద్రశేఖర్, ఈఎన్‌టీ ఆసుపత్రి యూనిట్ అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం...

గౌలిపురా: మానసిక వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన అబ్దుల్ ఖలీల్ ఖురేషి (50) కొన్నేళ్ల క్రితం భార్యతో విడాకులు తీసుకునితన సోదరుడి ఇంట్లో ఉంటున్నాడు. కొంత కాలంగా అతను మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. గత నెల 12న ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన అతను తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించినా ఫలితం లేక పోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ రిజర్వేషన్ల బంద్‌ను విజయవంతం చేయాలి

నాంపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పును నిరసిస్తూ బీసీ సంఘాల జేఏసీ ఇచ్చిన బంద్‌కు జాతీయ బీసీ సంఘం మద్దతు ఇస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు డాక్టర్ దేరంగుల ఉదయ్ కిరణ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం సైఫాబాదులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18న జరిగే రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేసిందన్నారు. కులాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాలని కోరారు. బంద్‌కు సహకరించని పార్టీలను బీసీ ద్రోహులుగా ప్రకటించడం జరుగుతుందని, కలిసి వచ్చే పార్టీలకు భవిష్యత్తులో బ్రహ్మరథం పడుతామని పేర్కొన్నారు. తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీకి మనుగడ ఉండదన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

గౌలిపురా: పార్టీలకతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని యాకుత్‌పురా నియోజకవర్గ ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. బుధవారం ఆయన అధికారులతో కలిసి గౌలిపురా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...డివిజన్‌లోని బస్తీలు, కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాల సమస్యలను ప్రజలు తన దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ అనంతరం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

చికిత్స పొందుతున్న యాచకుడి మృతి



జంగయ్య మృతదేహం

సంతోష్‌నగర్: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యాచకుడు మృతి చెందిన సంఘటన సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సంతోష్‌నగర్ ఫుట్‌పాత్‌పై జీవనం సాగించే యాచకుడు జంగయ్య (60) ఈ నెల 8న రాఘవేంద్ర హోటల్ ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలన్నారు.

నిరాడంబరుడు గోపాలకృష్ణసాయి



గోపాలకృష్ణ సాయికి పురస్కారాన్ని అందజేస్తున్న కేవి.రమణచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఆరు దశాబ్దాలుగా సాంస్కృతిక, సామాజిక, రాజకీయ రంగాల్లో విశేషమైన కృషి చేస్తూ నిరాడంబరుడిగా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదిస్తున్న మహోన్నతుడు బబ్బెళ్లపాటి గోపాలకృష్ణసాయి అని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం రవీంద్రభారతిలో సంగమం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ నటుడు బబ్బెళ్లపాటి గోపాలకృష్ణసాయి సామాజిక, సాంస్కృతిక జీవిత వజ్రోత్సవం, సంగమం జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ..... మరుగునపడ్డ ఎందరో కళాకారులను వెలుగులోకి తెచ్చేందుకు గోపాలకృష్ణ చేసిన ప్రయత్నాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్, వసంత కృష్ణ ప్రసాద్, మాజీ పార్లమెంటు సభ్యులు తులసిరెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు కేవి.రమణచారి, సినీనటి మంజుభార్గవి, సినీ గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ, సంగమం ఫౌండేషన్ వ్యవస్థాపకులు సంజయ్‌కిశోర్ తదితరులు పాల్గొన్నారు.